

రామాయంపేట: డి.ధర్మారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ పండిత్



కొల్చారం: రంగంపేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు అంబర్‌సింగ్ రాథోడ్, నాగరాజ్, గణేశ్‌రెడ్డి

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా యువజన సంక్షేమాధికారి నాగరాజ్
- కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి: జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పండిత్

కొల్చారం/రామాయంపేట, అక్టోబర్ 27: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీవో కార్యాలయ సూపరింటెండెంట్ అంబర్‌సింగ్ రాథోడ్, జిల్లా యువజన సంక్షేమ అధికారి, మండల ప్రత్యేకాధికారి నాగరాజ్, కొల్చారం ఎంపీడీవో గణేశ్‌రెడ్డి సూచించారు. కొల్చారం మండలంలోని రంగంపేటలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సీఇవో నవీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతంతో ధాన్యం ఉండేలా చూడడంతో పాటు ధాన్యం తూర్పార పట్టాలని సూచించారు. ఎన్నికలు ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి నవంబర్ 23వ తేదీలోపు పూర్తి అయ్యేలా కలెక్టర్ ఆదేశాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, సిబ్బంది బీరప్ప, శ్రీనివాస్, సిద్ధు, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

☛ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామీణ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పండిత్, రామాయంపేట వ్యవసాయశాఖ మండల అధికారి రాజ్‌నారాయణ సూచించారు. శుక్రవారం పీఏసీఎస్ అధ్వర్యంలో రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా రైతులు 16,394 ఎకరాల్లో వరి ధాన్యం వేశారని, 31,107 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.

మండల వ్యాప్తంగా సహకార సంఘం అధ్వర్యంలో 12, ఐకేపీ ఆధ్వర్యంలో 2 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ఏదైనా పొరపాట్లు జరిగితే వెంటనే వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులకు తెలుపాలన్నారు. కార్యక్రమంలో రామాయంపేట సహకార శాఖ సీఈవో పుట్టి నర్సింహులు, కార్యదర్శి దుర్గారెడ్డి ఉన్నారు.



ఎఫ్ఐఆర్ నమోదును వివరిస్తున్న ఎస్సై మహ్మద్ గౌస్

## పోలీసు విధులపై అవగాహన

కొల్చారం, అక్టోబర్ 27: కొల్చారం పోలీస్ స్టేషన్‌లో అమరవీరుల సంస్మరణలో భాగంగా శుక్రవారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎస్సై మహ్మద్ గౌస్ కొల్చారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు పోలీసుల విధులు, కేసుల నమోదు, చట్టాల గురించి వివరించారు. అలాగే ఆపద వచ్చినప్పుడు పోలీసుల సహాయం ఏ విధంగా అడగాలనే విషయమై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై తారాసింగ్, పోలీస్ సిబ్బంది మహేశ్, అశోక్, సౌందర్య, యాదమ్మ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ పాల్గొన్న నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి

నిజాంపేట, అక్టోబర్ 27: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిజాంపేటలో ఎస్సై ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నూతన బస్టాప్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడే దశలో ఎంతో మంది పోలీసులు అమరులైనారని వారిని స్మరించుకునే క్రమంలోనే బైక్ ర్యాలీ కార్యక్రమం చేపట్టామన్నారు. రేపు (29వ తేదీన) పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రామాచారి

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రామాచారి

మనోహరాబాద్, అక్టోబర్ 27:మనోహరాబాద్ మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జోన్నోజు రామాచారిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టు సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. గౌరవ అధ్యక్షుడిగా మహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రాగిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, శివకుమార్, కార్యదర్శిగా నరేశ్, సభ్యులుగా ప్రవీణ్‌చారి, భరత్, నవీన్, నర్సింహా, శ్రవణ్‌లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, పక్కన ఎంపీపీ, జడ్పీటీసీలు

## 30న ఖేడ్‌లో సీఎం సభను సక్సెస్ చేయాలి

- పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు పిలుపు

పెద్దశంకరంపేట, అక్టోబర్ 27: నారాయణఖేడ్‌లో ఈనెల 30న నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆసూరి మురళీపంతులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జడ్పీటీసీ విజయరామరాజులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామ నుంచి అధిక సంఖ్యలో యువకులు, మహిళలు పెద్దలను ఖేడ్‌లో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి సభకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు చూసి తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ అత్యధిక సీట్లు సాధించి ఖేడ్ ఎమ్మెల్యేగా భూపాల్‌రెడ్డి, సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టుడు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కుల, మత బేధాలు లేకుండా అన్ని వర్గాలకు, అభివృద్ధి, సంక్షేమం పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి కేవలం తొమ్మిదేండ్లలో చూపించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు ముచ్చటగా మూడోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి రమేశ్, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మానిక్‌రెడ్డి, దామోదర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

## ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

రామాయంపేట, అక్టోబర్ 27: రామాయంపేట పట్టణంలోని మెదక్ చౌరస్తాలోని శుక్రవారం మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడమే తమ లక్ష్యమన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న మాలమంతా ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బైరం సిద్ధరాములు, కుమార్, కొక్కు బాబు, రాజయ్య, గావు పరమేశ్, భాగయ్య, శ్యాంసుందర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



చేగుంట: వడియారంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి జయరాజ్

## ఐకేపీ ఆధ్వర్యంలో దాన్యం కొనుగోలు కేంద్రం

చేగుంట, అక్టోబర్ 27: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని చేగుంట మండల ప్రత్యేక అధికారి జయరాజ్ పేర్కొన్నారు. చేగుంట ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని వడియారం, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ, ఎంపీడీవో ఆనంద్‌మేరి, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఏవో శోభారాణి, పంచాయతీ కార్యదర్శి విజయపాల్‌రెడ్డి, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వర్క్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందజేస్తున్న జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు

వెల్దుర్తి, అక్టోబర్ 27: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి జీఎంఆర్ సంస్థ ఎల్లప్పుడు అండగా నిలుస్తున్నదని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. మాసాయిపేట మండల పరిధిలోని రామంతాపూర్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం 'జ్ఞానంతో ఆనందం' వర్క్‌బుక్స్‌ను పాఠశాల హెచ్ఎం నవీన్, ఉపాధ్యాయురాలు ఉదయశ్రీలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పలు రకాల మౌలిక వసుతుల కల్పన, విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో బీఆర్ఎస్ నేత మృతి

రామాయంపేట, అక్టోబర్ 27: బ్రెయిన్ స్ట్రోక్‌తో బీఆర్ఎస్ నేత మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌లో శుక్రవారం జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం తాటి భాగయ్య (60)కు తలలో నొప్పి రావడంతో రామాయంపేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున భాగయ్య మృతి చెందాడని వెల్లడించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మ, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ ఉద్యమ కాలం నుంచి భాగయ్య పార్టీలో పనిచేస్తున్నాడని మండల రైతుబంధు అధ్యక్షుడు నర్సారెడ్డి, సర్పంచ్ భర్త పంబాల శ్రీనివాస్ తెలిపారు.